












సత్యవేడు : శ్రీసిటీ పారిశ్రామికవాడ

# సత్యవాడ


సత్యవేడు ముఖ చిత్రం

ప్రజలు పరవశించే ప్రకృతి, పర్యాటకం..పూజించే ఆధ్యాత్మికం.. ఉపాధికి ఊతమిచ్చే పారిశ్రామిక రంగానికి సత్యవేడు నియోజకవర్గం ప్రత్యేకతగా మారింది. శ్రీసిటీ పారిశ్రామికవాడ, ఇటు ఆధ్యాత్మిక , పర్యాటక కేంద్రాలు, సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది.

- పరిశ్రమలకు కేంద్రంగా సత్యవేడు
- ఆధ్యాత్మిక, పర్యాటకానికి నెలవు
- శ్రీసిటీతో సత్యవేడుకు వెలుగు

వరదయ్యపాళెం : ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని సత్యవేడులోని గ్రామ దేవత గంగమ్మపై నమ్మకమే శక్తి వీడుగా.. కాలక్రమేణా సత్యవేడుగా మారింది. 1963–1964లో జరిగిన రాష్ట్రాల పునర్విభజనలో తమిళనాడులోని సత్యవేడు ఆంధ్ర రాష్ట్రంలోకి చేరింది.

**శ్రీసిటీతో మారిన రూపురేఖలు**

వెనుకబడిన సత్యవేడులో 2008లో 8 పరిశ్రమలతో శ్రీ సిటీ పారిశ్రామికవాడ అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో పురుడు పోసుకుంది. క్రమేణా నేటికి శ్రీసిటీ పారిశ్రామికవాడ అంచెలంచెలుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 200కు పై చిలుకు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. తద్వారా 50 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయి. దీంతో విద్యతో సంబంధం లేకుండా ఉద్యోగాలు పొందుతూ ఆర్థికంగా బలపడుతున్నారు.

**నియోజకవర్గ ప్రత్యేకత**

నాగలాపురంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధిగాంచిన పళ్లి కొండేశ్వరస్వామి శైవక్షేత్రం, వేద నారాయణస్వామి ఆలయాలు ప్రసిద్ధి. అలాగే నారాయణవనంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, వరదయ్యపాళెం సమీపంలో ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడికి ఆంధ్ర–తమిళనాడు రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తారు. నారాయణవనం మండలంలో కైలాసకోనలోని శివాలయం, జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.




సత్యవేడు : సురుటుపల్లి పళ్లికొండేశ్వరస్వామి ఆలయం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కైలాసకోన జలపాతం


ఏకం ఆలయం


అరణియార్ ప్రాజెక్టు

ఏకం ఆధ్యాత్మిక కేంద్రం వరదయ్యపాళెం మండలంలో ఏర్పాటైన ఏకం (కల్కి భగవాన్‌కు చెందిన) ఆధ్యాత్మిక కేంద్రం ఈ ప్రాంతానికి ఓ ప్రత్యేకత. ఇక్కడ నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు ప్రపంచ దేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు.

**సాగునీటికి పెద్దపీట:** వ్యవసాయ రంగానికి సాగునీటి ప్రాజెక్టులు అత్యధికమే. పిచ్చాటూరులో అరణియార్ ప్రాజెక్టు, నాగలాపురం మండలంలో భూపతేశ్వరకోన, బీఎన్‌కండ్రిగ మండలంలో ఉబ్బలమడుగు ప్రాజెక్టు, కేవీబీపురం మండలంలో కాళంగి రిజర్వాయర్‌లు ఉన్నాయి. వీటిద్వారా 27 వేల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. ఈ జలాశయాలు రైతులకు వరంగా మారాయి.

























